గ్రామస్థాయి కమిటీల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు : పిఒ

పార్వతీపురం : గ్రామస్థాయి కమిటీల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేయాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో జీడి పిక్కల కొనుగోళ్లపై సమీక్షా సమావేశాన్ని పిఒ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి పిక్కల కొనుగోళ్లకు సంబంధించి 8 మండలాల్లో 20 గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటుచేసి, వాటి ద్వారా కొనుగోళ్లను చేపట్టాలని తెలిపారు. ఇందుకు సంబంధించి ఈనెల 9న సిబ్బందికి జీడి కొనుగోళ్ల యాప్ గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే ఈనెల 10,11 తేదీల్లో రస్తాకుంటుబాయిలో 8 మండలాల విలేజ్ లెవెల్ కమిటీ సభ్యులకు కృషి విజ్ఞాన కేంద్రం శిక్షణ ఇస్తుందని తెలిపారపు. జీడి పిక్కలను కొనుగోలు చేసే సమయంలో నాణ్యమైన జీడిని కొనుగోలు చేయాలని పిఒ ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, ఎపిడి వై.సత్యంనాయుడు, ఎఒపి మురళీధర్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ పాల్గొన్నారు.

గుక్కెడు నీటికి గంపెడు కష్టాలు

- పనిచేయని నీటి పథకాలు, గ్రావిటీ స్కీంలు
- మొరపెట్టుకున్నా పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఊట గెడ్డలు, చెలమలే గతి
- కలుషిత నీటితో రోగాల పాలౌతున్న గిరిజనులు

తిత్తిరికి చెందిన గిరిజన మహిళలు ఊట బావి నుండి తెస్తున్న తాగు నీరు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని అనేక గిరిజన గ్రామాల్లో ప్రజలు తాగునీటికి అల్లాడిపోతున్నారు. వేసవి తొలిరోజుల్లోనే ఆయా గ్రామాల్లోని రక్షిత నీటిపథకాలు, గ్రావిటీ స్కీములు, బోర్లు అన్నీ అడుగంటి నిరుపయోగంగా మారడంతో గిరిజనులు కిలోమీటర్ల దూరానున్న ఊటగెడ్డల్లో, చెలమల్లోని కలుషితనీటిని ఆశ్రయించి రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఏటా వేసవిలో ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు, నేతలు కనీస చర్యలు చేపట్టడం లేదని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఏజెన్సీలో ప్రభుత్వం కోట్లాది రూపాయిలు వెచ్చించి వాటర్ ట్యాంకులు, బోర్లు, గ్రావైట్ స్కీములు వేస్తున్నప్పటికీ గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. మండలంలోని వలసబల్లేరు పంచాయతీలో గల చాపరాయగూడ, ఆగంగూడ, బొడ్డుగాడిగూడ, తిత్తిరి పంచాయతీలో గల పులిపుట్టి, సిడిగూడ, ఎగువపులిపుట్టి, ఆవిరికాగుమానుగూడ, గుమ్మిడిగూడ, జరడ పంచాయతీలో గల మూలిగూడ, ఈతమానుగూడ, కొత్తగూడ, జి.సివడ పంచాయతీల్లోని కోటకొండ, ఈతమానుగూడ, లాలగాడి గూడ, నీలకంఠాపురం పంచాయతీలోని కేదారిలంక, మండలడంగుగూడ, సుక్కుగాడిగూడ, చింతమానుగూడ తదితర గిరిజన గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటగెడ్డలను ఆశ్రయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో గ్రావిటీ స్కీములు ఉన్నా వేసవి వస్తే అవి ఇంకిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఊటగెడ్డలపైనే గిరిజనులు ఆధారపడాల్సి వస్తుంది.

తాగునీటి కోసం గిరిజనులు పడుతున్న కష్టాలు మరీ దారుణం. కొండ, గుట్టలు దాటి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి. తాగునీటి కోసం మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. తమ సమస్యను అనేకసార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నామని, అయితే ఎవరూ తమను పట్టించుకోకపోవడంతో కలుషితనీటిని తరచూ దగ్గు, జలుబుతో బాధ పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో జల జీవన్ మిషన్ పథకం కింద నిధులు మంజూరు చేసినా, అనేక గ్రామాల్లో బోరు పాయింట్లు తవ్వి వదిలేశారే తప్ప, పైపులైన్లు, కుళాయిల ఏర్పాటు చేయలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్రాగునీటి సమస్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

ఎన్నో ఏళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. తాగేందుకు గుక్కెడు నీటి కోసం సుమారు 4 కిలోమీటర్లు దూర ప్రాంతాల్లో ఉన్న ఊట గెడ్డలు, చెలమలు వద్దకు బిందెలతో, కావిడితో నీళ్లు మోసుకొని తీసుకువచ్చి డ్రమ్ముల్లో నింపుకొని పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రతి ఏటా ఈ సమస్య ఇలా సాగుతూనే ఉంది. ప్రజా ప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడంలేదు. ఎన్నికల ముందు వచ్చి ప్రజా ప్రతినిధులు హామీలు ఇచ్చి వెళ్తారు తప్ప పరిష్కరించే దాఖలాల్లేవు.

బి. వెంకటరావు,
చాపరాయిగూడ.

అన్ని గ్రామాలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు

మండలంలో కొన్ని గ్రామాలకు జలజీవన మిషన్ ద్వారా పనులు జరిగాయి. మిగతా గ్రామాలకు కూడా జలజీవన్ మిషన్ టెండర్లు జరుగుతున్నాయి. 15 రోజుల్లో టెండర్లు పూర్తి పూర్తి కానున్నాయి. పూర్తయిన వెంటనే అన్ని గ్రామాల్లో తాగునీటి సదుపాయం శతశాతం కల్పించి ప్రజలకు తాగునీటి కష్టాలు తీరుస్తాం.

ఆర్. వేణుగోపాల్,
ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్, కురుపాం.

గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై

సిపిఎం వినూత్న నిరసన

ప్రజాశక్తి కొమరాడ

పెంచి గ్యాస్ రేట్లు తక్షణమే తగ్గించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్యాస్ వద్దు... కర్రల ముట్టి ముద్దు అంటూ కర్రలు ముట్టిని తలపై పెట్టుకుని గ్యాస్ సిలిండర్ పైన కర్రల ముట్టి పెట్టి వినూత్నరీతిలో కొమరాడలో మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌కు రూ.50 పెంచుతూ శ్రీరామ నవమి కానుకగా ప్రజలకు అందజేసిందని ఎద్దేవా చేశారు. పథకాలు పెట్టి మహిళలను అన్ని విధాలా ఆదుకుంటున్నామని ప్రకటిస్తూ, మరో వైపు ఇలా నిత్యవస వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు పెంచుకపోవడం దారుణమన్నారు. తక్షణమే పెంచి గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని మెచ్చరించారు. కార్యక్రమంలో గ్యాస్ వినియోగదారులతో పాటు సిపిఎం నాయకులు రెడ్డి శివ నాయుడు పాల్గొన్నారు.

బలిజిపేట: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ, మండల నాయకులు యమ్మల మన్మధరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని ప్రజలను నమ్మబలికి ఇప్పుడు గ్యాస్‌పై రూ.50 పెంచడం ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీయడమేనని అన్నారు. ఒకపక్క పనుల్లేక ప్రజలు ఇబ్బందులుపడుతుంటే మరోవైపున గుదిబండలాగా గ్యాస్ పెంచడం చాలా దారుణమన్నారు. వెంటనే పెంచిన ధరలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరి, లక్ష్మణ, కృష్ణ, భానుమూర్తి, నల్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడలో కట్టెల మోపు నెత్తిన పెట్టుకొని నిరసన తెలుపుతున్న నాయకులు

సీతానగరం : మహిళల నెత్తిన మోడీ మోపిన గ్యాస్ భారాలు తగ్గించాలంటూ గ్యాస్ బండను పెట్టుకుని నిరసన తెలిపారు. సిపిఎం మండల నాయకులు జి.వెంకటరమణ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ తన కార్పొరేట్ మిత్రులకు లాభం చేకూర్చేందుకు ప్రజలపై గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి భారాలను మోపడం సరికాదన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలు జి.మాలతి, ఎం.సత్తెమ్మ, నీలాపు లక్ష్మి, పిరిడి గంగమ్మ, బి అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

బలిజిపేటలో రాస్తారో చేస్తున్న సిపిఎం నాయకులు; సీతానగరంలో నెత్తిన గ్యాస్ బండ పెట్టుకొని నిరసన తెలుపుతున్నమహిళలు

ఎంఎంసి నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న మంత్రి సంధ్యారాణి

మెరుగైన సేవలందించాలి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు రూరల్

వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా నియామకమైన చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులు రైతులకు మెరుగైన సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆకాంక్షించారు. మంగళవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముఖీ సూర్యనారాయణ, వైస్ చైర్మన్‌గా మింది సింహాచలంతో పాటు 13 మంది కమిటీ సభ్యులను ప్రభుత్వం కొత్తగా నియమించడంతో వారందర్నీ మంత్రి సంధ్యారాణి సన్మానించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధికి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతుల ఉత్పత్తులకు సరైన ధర, సమర్ధమైన మౌలిక వసతులు, పారదర్శక విధానాల అమలులో ఈ కమిటీల పాత్ర అమూల్యమైందని, ఇటువంటి కమిటీకి వ్యవసాయంలో సుదీర్ఘ అనుభవం గల ముఖీ సూర్యనారాయణ వ్యవసాయ సమస్యల పట్ల లోతైన అవగాహన కలిగిన నాయకులని, ఆయన నాయకత్వంలో ఈ కమిటీ రైతుల సంక్షేమానికి అనేక విలువైన నిర్ణయాలు తీసుకుంటుందని నమ్మకంగా చెప్పగలనని అన్నారు. వైస్ చైర్మన్ మింది సింహాచలం, 13 మంది కమిటీ సభ్యులు కూడా వ్యవసాయంపై అనుభవం ఉన్న వారినే ప్రభుత్వం నియమించిందని వారిందరికి ప్రభుత్వం తరుపున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను అని తెలిపారు. సభ్యులు నియోజకవర్గ రైతాంగానికి శక్తివంతమైన మద్దతుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ, మండల, మెంటాడ మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మది తిరుపతి రావు, ఆముదాల పరమేష్, చలుమూరి వెంకటరావు, నాయకులు యుగంధర్, శ్యామ్, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సిసి కెమెరాలు : కలెక్టర్

విద్యార్థుల బాగోగుల బాధ్యత హెచ్‌డబ్ల్యుఒలదే
అనీమియా సమస్యలు ఉత్పన్నం కారాదని సూచన

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రతి వసతి గృహంలో నెల రోజుల్లోగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, తద్వారా విద్యార్థుల నడవడికలను గమనించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వసతి గృహ సంక్షేమాధికారులను ఆదేశించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఇతర సంక్షేమ జిల్లా అధికారులు, వసతి గృహాల సంక్షేమాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని మంగళవారం తన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పాలని కలెక్టర్ వివరించారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఫుటేజీలను ప్రతి నెలా బ్యాకప్ చేయాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వసతి గృహంలో చేరిన నాటి నుంచి విద్యాభ్యాసం ముగిసి బయటకు వెళ్లే వరకు విద్యార్థుల బాగోగులను చూడాల్సిన బాధ్యత సంబంధిత హెచ్‌డబ్ల్యుఒలదేనని కలెక్టర్ తేల్చి చెప్పారు. ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడి విద్యార్థులు ఆరోగ్యపరంగా బాగా ఉన్నప్పటికీ, గతేడాది వివిధ కారణాలతో విద్యార్థుల మరణాలు సంభవించాయన్నారు. అటువంటివి ఇకపై పునరావృతం కారాదని, విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులు బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆశావహ జిల్లాగా పార్వతీపురం ఎంపికైనందున ఇక్కడ వసతి గృహాల్లో చదివే విద్యార్థుల ఆరోగ్య ప్రమాణాలు మరింత మెరుగ్గా ఉండాలని సూచించారు. విద్యార్థికి ప్రతి నెలా వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య వివరాలను నమోదుచేస్తూ రికార్డును నిర్వహించాలని అన్నారు.

హాస్టళ్ల సంక్షేమాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

అలాగే విద్యార్థులకు పరీక్షలు జరిపే వైద్యులు, సిబ్బందితో తత్సంబంధాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల పట్ల మరింత ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, ప్రతి నెలా వారికి అనీమియా పరీక్షలు నిర్వహించి 11 శాతం కంటే అధికంగా హిమోగ్లోబిన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి బాలికకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కల్పించి, అటువంటివి జరగకుండా చూడాలని చెప్పారు. ప్రతి బాలికల వసతి గృహంలో షీ కంప్లైంట్ బాక్సులను నిర్వహించాలని, ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తించినట్లు పిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అందరికీ పరుపులు, మంచాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి ఇతర సదుపాయాలను కల్పించాలన్నారు. వసతి గృహాల్లో న్యూట్రీ గార్డెన్లను పెంచాలని తెలిపారు. క్రిమి కీటకాలు, విష సర్పాలు వంటివి రాకుండా వసతి గహాల్లో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, ప్రహరీగోడలు నిర్మించుకోవాలని, ప్రహరీగోడలు లేనిచోట బయో పెన్సింగులనైనా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పదో తరగతి ఉత్తీర్ణతలో ప్రతి ఏటా జిల్లా ప్రథమ స్థానంలో నిలుస్తుందని, అలాగే ఈ ఏడాది కూడా ప్రథమ స్థానంలో నిలవాలని, అందుకు తగిన విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇకపై వసతి గృహాలను ఆకస్మిక తనిఖీలు చేస్తారని, ఆ తనిఖీలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత హెచ్‌డబ్ల్యుఒలదేనని కలెక్టర్ వివరించారు. పదో తరగతి అనంతరం ఎటువంటి డ్రాప్ అవుట్స్ లేకుండా తదుపరి తరగతుల్లో విద్యార్థులు చేరేలా వారికి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎండి.గయాజుద్దీన్, వికలాంగుల, గిరిజన సంక్షేమశాఖల అధికారులు కె.కవిత, ఆర్.కృష్ణవేణి, ఉమ్మడి జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, సమగ్ర శిక్ష ఎపిఒఆర్.తేజేశ్వరరావు, ఎస్సీ,ఎస్టీ, బీసీ ఇతర సంక్షేమ వసతి గహాల సంక్షేమాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలాల ప్రత్యేక అధికారులు వీరే

ప్రజాశక్తి - పార్వతీపురం

నియోజక వర్గాలకు, మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి శుక్రవారం మండలాల్లో పర్యటిస్తారని చెప్పారు. మండల అభివృద్ధి పర్యవేక్షణ చేస్తారనిఅన్నారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను తనిఖీ చేయాలని ఆయన ఆదేశించారు.

నియోజక వర్గాల ప్రత్యేక అధికారులు

పార్వతీపురం : సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, పాలకొండకు సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, కురుపాంకు కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ డా. పి ధర్మచంద్రా రెడ్డి, సాలూరు డ్వామా పీడీ కె రామచంద్ర రావు.

మండలాల వారీగా ప్రత్యేక అధికారులు

పాచిపెంట : జిల్లా సూక్ష్మ సాగునీటి అధికారి వి రాధాకష్ణ,
బలిజిపేట: జిల్లా వ్యవసాయ అధికారి కె రాబర్ట్ పాల్
గరుగుబిల్లి : గ్రామీణ నీటి సరఫరా అధికారి ఓ ప్రభాకర రావు,
మక్కువ జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి శ్యామల,
పార్వతీపురం: డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరక్టర్ ఎం సుధారాణి
కొమరాడ : జిల్లా భూగర్భ జలాల అధికారి ఎ.రాజశేఖర రెడ్డి,
సీతానగరం : పౌర సరఫరా సంస్థ జిల్లా మేనేజర్ ఐ రాజేశ్వరి,
సాలూరు: జిసిసి డివిజనల్ మేనేజర్ వి మహేంద్ర కుమార్,
పాలకొండ : జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.ఎస్ మన్మథరావు,
వీరఘట్టం :జిల్లా ప్రణాళిక అధికారి పి వీరరాజు,
గుమ్మలక్ష్మీపురం : జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి డా.టి కనకదుర్గ,
కురుపాం : సమగ్ర శిక్ష ఎపిసి ఆర్ తేజేశ్వర రావు
సీతంపేట : పాలకొండ డివిజనల్ అభివద్ధి అధికారి వి వి గోపాల కష్ణ,
భామిని : డిఆర్‌డిఎ ఎపిడి వై.సత్యంనాయుడు
జియ్యమ్మవలస: జిల్లా పంచాయతీ అధికారి టి కొండల రావు,

మున్సిపాలిటీ లకు

సాలూరు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.మంజులవీణ
పార్వతీపురం : ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్
పాలకొండ : సీతంపేట ఐటిడిఎ ఎపిఒ జి.చినబాబు

మలేరియా రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ఆరోగ్య ఖాతాలు శత శాతం పూర్తి కావాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని మలేరియా రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనికలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గతంలో కంటే తీవ్రంగా ప్రస్తుత మలేరియా ఉంటుందని వైద్యాధికారులు తెలిపిన నేపథ్యంలో వారికి అవసరమైన చికిత్సను అందించడంతో పాటు తగినంత నీరు, ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే జిల్లాలో అభా గుర్తింపు కార్డులు (ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాలు) శత శాతం పూర్తి కావాలని వైద్యాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి ఆరోగ్య గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి పిహెచ్సీ పరిధిలోని వైద్యాధికారులు వారి పరిధిలోని అందరికి అభా గుర్తింపుకార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ఈకేవైసి చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మే 1 నుంచి యాంటి లార్వా చేస్తారని, ఈలోగా డయేరియా, మలేరియా వంటి వ్యాధులు సంక్రమించకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. అనీమియా యాక్షన్ కమిటీలు రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. అనారోగ్య కారణాలతో పిల్లల మరణాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లాలో అనారోగ్య సమస్యలతో జిల్లాలో ఎటువంటి మరణాలు సంభవించకుండా ఆశా, ఎఎన్ఎం, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలని తెలిపారు. కలుషిత నీరు, చలమల నీరు తీసుకోకుండా రక్షిత మంచి నీటిని తీసుకునేలా స్థానిక ఎంపీడీఓ, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, పలువురు వైద్యాధికారులు, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ పీడీలు డా.టి.కనకదుర్గ, ఎం.సుధా రాణి, డిపిఒ టి.కొండలరావు, జిల్లాగ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.తేజేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, యుపీహెచ్సీ, పీహెచ్సీ, ఏరియా ఆసుపత్రుల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు నిలువ నీడ కరువు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. రోజు వారీ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. వడగాల్పుల తీవ్రత కనిపిస్తుంది. ఇటువంటి తరుణంలో ఉపాధి హామీ పనుల వద్ద ఎటువంటి సౌకర్యలు లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలువ నీడ లేక మండే ఎండలోనే ఉపాధి పనులు చేస్తున్నారు. దాహం వేస్తే తాగడానికి కనీసం మంచినీరు అందుబాటులో ఉండడం లేదు. ఈ నేపథ్యంలోనే జియమ్మవలస మండలం దంగభద్రవలసకు చెందిన ఉపాధి కూలీ పల్ల సీతమ్మ వడదెబ్బతో మృతి చెందింది. మండే ఎండలకు సొమ్మసిల్లి అకస్మాత్తుగా మృతి చెందింది. ఈ సంఘటనతో ఉపాధి కూలీలంతా ఆందోళన చెందారు. జిల్లాలోని 15 మండలాల్లో వేలాది సంఖ్యలో ప్రజలు రోజువారీ ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. వీరికి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. ఉపాధి హామీ పనుల వద్ద విశ్రాంతి గుడారాలు, తాగునీటి సౌకర్యం, మెడికల్ కిట్లు అందుబాటులో లేని పరిస్థితి ఉంది. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఉపాధి పనులకు వెళ్తున్న తమకు ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదని కూలీలు చెబుతున్నారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా అన్ని సౌకర్యాలు ఉపాధిహామీ పనుల వద్ద సమకూర్చాలని కోరుతున్నారు. మరోవైపు వారాల తరబడి ఉపాధి హామీ పనులు చేపట్టినా నేటి వరకు కూలీలకు వేతనాలందని పరిస్థితి. ఎటువంటి ఆధారం లేక ఉపాధి హామీ పనులకు వెళ్తున్నా సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని కూలీలు ఆవేదన చెందుతున్నారు. ఫిబ్రవరి లో చేసిన పనులకు నేటికీ ఉపాధి డబ్బులు అందలేదని జియమ్మవలస మండలం పెదబుడ్డిడి గ్రామ ఉపాధి కూలీలు తెలిపారు. అధికారులు స్పందించి ఉపాధి బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

ఎండలో పనిచేస్తున్న ఉపాధిహామీ వేతనదారులు

బాబోయ్.. ఇదేం బిల్లు!

మూడు యూనిట్లకు రూ.168.68

ప్రజాశక్తి మక్కువ

కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ బిల్లులు చూసి వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. అధికారంలోకి రాకముందు విద్యుత్ బిల్లులు తగ్గిస్తామంటూ ఊదరగొట్టిన నాయకులు ఈరోజు అదనపు వాడకం పేరుతో వినియోగదారుని నడ్డి విరుస్తున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మార్చికి సంబంధించి మండల కేంద్రంలోని ఓ వినియోగదారుడు కేవలం 3 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తే సుమారు రూ.6.93 పైసలు బిల్లు రావాల్సి ఉండగా, అదనపు ఛార్జీలన్నీ కలిపి రూ.168 .65 పైసల బిల్లు రావడంతో ఆశ్చర్యపోయారు. ఇందులో కేవలం ఎఫ్‌పిపి ఛార్జీలు రూ.102 రావడం ఆశ్చర్యానికి గురి చేసిందని అన్నారు. సర్‌ఛార్జీలను కలిపి మొత్తానికి బిల్లు రావడంతో వినియోగదారుడు ఆవేదనకు గురయ్యాడు. తక్కువ యూనిట్లు వినియోగించుకున్న వారికి బిల్లు ఇలా వస్తే అధిక యూనిట్‌లో వినియోగించుకున్న వినియోగదారుని పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అదనపు ఛార్జీలను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని గిరిజన గ్రామాలకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పాలకొండ నియోజకవర్గంలోని 4 మండలాల ఎఇలు, డిఇలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాల జాబితా తయారుచేసి సమస్య పరిష్కరించుటకు ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. పూర్తిగా తాగునీటి ఇబ్బంది ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పాలకొండ డిఇ మధుసూదన్‌రావు, మూడు మండలాల ఏఈలు సత్యం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సిఎం సహాయనిధి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల పూతికవలసకు చెందిన మంగ వెంకటరాజు అనారోగ్యానికి గురైన విషయం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దృష్టికి బాధితులు తీసుకురావడంతో ఆమె స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కు మంజూరు చేయించి మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో గల ఆమె క్యాంపు కార్యాలయం వద్ద బాధితులకు రూ.లక్షా 20,483 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు మాట్లాడుతూ చెప్పిన వెంటనే స్పందించి తమకు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల మండల కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మాజీ ఎంపిపి రమణమూర్తి, టిడిపి నాయకులు రమేష్, యువరాజు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పిహెచ్సీ ల్లో సాధారణ ప్రసవాలు మెరుగు పడేందుకు శిక్షణ నైపుణ్యాన్ని సద్వినియోగం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు స్టాఫ్ నర్సులకు సూచించారు. సాధారణ ప్రసవాలపై రీ ఓరియంటేషన్ శిక్షణ పూర్తి చేసుకున్న స్టాఫ్ నర్సులకు ఆరోగ్య కార్యాలయంలో మంగళవారం డిఎంహెచ్ఓ చేతుల మీదుగా ధృవ పత్రాలను అందజేశారు. బ్యాచ్ ల వారీగా పిహెచ్సీ స్టాఫ్ నర్సులకు నిర్దేశించిన ఎస్బిఎ (స్కిల్డ్ బర్త్ అటెండెంట్) శిక్షణా కార్యక్రమంలో రెండవ బ్యాచ్‌కి గత నెల19న ప్రారంభించి ఈ నెల 8 వరకు జిల్లా ఆసుపత్రిలో,ఆరోగ్య కార్యాలయంలో శిక్షణ ఇచ్చామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణలో గైనకాలజిస్ట్ లు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. మాతా,శిశు మరణాలు నివారించడం, పిహెచ్సీ ప్రసవాలు మెరుగు పర్చడం శిక్షణ ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు,డాక్టర్ రఘుకుమార్,డా ఎం.వినోద్ కుమార్,డిపిహెచ్ఎన్ఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

పట్టణంలో బుధవారం కొళాయిల ద్వారా త్రాగునీటి సరఫరా జరగదని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా జరిగే తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర నీటి సరఫరా జరిపి ప్రధాప పైపులైన్లు మరమ్మతులకు గురైనందున తాగునీటి సరఫరా జరగదని, ఇందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రజల నెత్తిన 'మోది'న గ్యాస్ బండ : కాంగ్రెస్

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంచడం తో పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం పడుతుందని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు అన్నారు. ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతున్న తరుణంలో గుక్కెడు గంజి నీళ్లు కాసుకునేందుకు వినియోగించే వంట గ్యాస్ ధర పెంచడంతో సామాన్యుని బతుకు ఛిద్రంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున పెంచిన గ్యాస్ ధర ను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీ కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి

ప్రజాశక్తి సీతానగరం

ఉపాధి పనులకు వెళ్లి వడదెబ్బకు గురైన జియ్యమ్మవలస మండలం డంగభద్రకు చెందిన పల్లా సీతమ్మ కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేతనదారులు ఎండల్లో పని చేస్తూ వడదెబ్బకు గురై చెలిపోతున్నారని, దీనిపై తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఎఎంసి వైస్ చైర్మన్‌గా గౌరీశంకర్

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని జనసేనకు చెందిన నాయకులకు కురుపాం ఎఎంసి వైస్ చైర్మన్ పదవి కేటాయిస్తూ కూటమి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. కొమరాడ మండలం చంద్రంపేటకు చెందిన జనసేన నాయకులు గారా గౌరీశంకర్‌కు కురుపాం ఎఎంసి వైస్ చైర్మన్‌గా నియమిస్తూ కూటమి ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జనసేనలో కీలకంగా వ్యవహరించి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి, పార్టీ కోసం కీలకంగా వ్యవహరించడంతో తనకు ఈ పదవి దక్కిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన వైఎస్ చైర్మన్ గౌరీ శంకర్ను పలువురు కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

నూకాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని గౌడవీధిలో గత వారం జరుగుతున్న నూకాలమ్మ తల్లి పండగలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఘటాన్ని మోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూకాలమ్మ తల్లి పండగ కార్యక్రమంలో పాల్గొని ఘటాన్ని మోయడం చాలా ఆనందదాయకంగా ఉందని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని నుకాలమ్మ తల్లిని కోరుకు న్నారు. కార్యక్రమంలో గౌడుకుల పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక కోర్టులో మండల న్యాయ సేవా సమితి సిబ్బంది పాలకొల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ మెంబర్లు మంగళవారం పారా లీగల్ వాలంటీర్లకు న్యాయవ్యవస్థ, గ్రామస్థాయిలో వాలంటీర్లు చేయాల్సిన కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం తహశీల్దార్ కార్యాల యం, పోలీస్ స్టేషను ఎక్సైజ్ కార్యాలయం సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ జి. వెంకటరావు, పారా లీగల్ వాలంటీర్లు అంధవరపు కోటేశ్వరరావు, సామాల రాజేష్, మోనంగి పృధ్వీ, ఎ.జోగులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన పారా లీగల్ వాలంటీర్లు

15న ఆశావర్కర్ల జిల్లా సదస్సు

ప్రజాశక్తి - సాలూరురూరల్

జిల్లాలో గల ఆశా వర్కర్లు ఎదురుకుంటున్న సమస్యలపై ఈనెల 15న పార్వతీపురంలో జరగనున్న జిల్లా సదస్సులో ఆశ వర్కర్లంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని బాగువలస, మామిడిపల్లి, తోణాం పిహెచ్‌సిల్లో మంగళవారం జరిగిన ఆశా వర్కర్ల సమావేశంలో యూనియన్ నాయకులు రాజేశ్వరి, మరియమ్మ, రమణమ్మ, కుమారి ఆశాలను ఉద్దేశించి మాట్లాడారు. ఆశా వర్కర్ల పట్ల జాతీయ ఆరోగ్య మిషన్ ఏర్పడి 2025 నాటికి 20 ఏళ్లు అవుతున్నా అందులో పని చేస్తున్న వర్కర్లకు మాత్రం ఎలాంటి ఉద్యోగ భద్రత లేదని, ఎనిమిది లక్షల మంది ఈ మిషన్ లో పనిచేస్తున్నారని తెలిపారు. ఆశాలకు రూ.10వేలు, సిహెచ్‌డబ్ల్యులకు రూ.4వేలు ఇస్తున్నా, పెరిగిపోతున్న ధరలకు తగ్గట్టుగా వేతనం లేదని, సంక్షేమ పథకాలు అరకొరగా అమలు చేస్తున్నారని, రాజకీయ వేధింపులు ఉన్నాయని తెలిపారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని, దీని కోసం జరుగుతున్న జిల్లా సదస్సులో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. కావున జిల్లాలోని ఆశా కార్యకర్తలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీదేవి, లక్ష్మి, గంగమ్మ, నర్సమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : ఈనెల 15న పార్వతీపురంలో జరిగే ఆశా కార్యకర్తల సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు జి.వెంకటరమణ కోరారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశాడే సందర్భంగా సీతానగరం, పెద అంకలం పిహెచ్‌సిల వద్ద ఆశా వర్కర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ఆశా వర్కర్ల యూనియన్ ప్రధాన రాష్ట్రకార్యదర్శి కె.ధనలక్ష్మి విచ్చేయనున్నారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కనీస వేతనాల చట్టం అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, రాజకీయ వేదింపులను అరికట్టాలని, 21 రకాల రికార్డులు నిర్వహణను, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, ఇతర సంస్థగత సమస్యలపై చర్చించేందుకు జిల్లావ్యాప్తంగా ఉన్న ఆశా వర్కర్లంతా పెద్ద ఎత్తున పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని నార్లవలస పంచాయతీ క్షేత్ర సహాయకుడిపై చర్యలు తీసుకొని జాబ్ కార్డు ఉన్నవారందరికీ పనులు కల్పించి, గత రెండు నెలలుగా పనిచేస్తున్న ఉపాధి కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిడిఒకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి మాట్లాడుతూ నార్లవలస పంచాయతీ క్షేత్ర సహాయకుడు కూలీలు పని అడుగుతున్నా పని ఇవ్వకుండా, అందుబాటులో లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎప్పుడూ అందుబాటులో ఉండడంలేదని, ఇటువంటి వ్యక్తి గిరిజనులకు ఏ విధంగా పనులు కల్పిస్తారని, ఆయన తీరుపై పలుమార్లు కూలీలు మొరపెట్టుకుంటున్నా అధికారులు స్పందించడంలేదన్నారు. ఇప్పటికైనా క్షేత్ర సహాయకుడిపై సమగ్ర విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, పని కావాల్సిన వారందరికీ పని ఇవ్వాలని కోరారు. మండలంలో జనవరి నుంచి ఇప్పటి వరకు ఉపాధి పనులు చేసిన కూలీలకు కూలి డబ్బులు చెల్లించకపోవడంతో కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోజువారీ అవసరాలు కూడా గడపడానికి అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. ఎండలు తీవ్రతంగా ఉండడంతో కూలీలు పని చేసిన చోట కనీస మౌలిక వసతులైన నీరు, నీడ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. నిర్లక్ష్యంగా ఉన్న నార్లవలస క్షేత్ర సహాయకుడుపై సమగ్ర దర్యాప్తు జరిపి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో కూలీలను సమీకరించి ఆందోళనలకు సిద్ధపడతామని తెలిపారు.

కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందర్రావు, కూనేటి చినబాబు, నాగేశ్వరరావు, రాము, సన్యాసిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను పేరు మార్పు ఫీజు తగ్గింపు

ఒక శాతం నుంచి అరశాతానికి కుదిస్తూ ఉత్తర్వులు

వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో ఇంటి పన్ను పేరు మార్పునకు సంబంధించిన ఫీజు తగ్గిస్తూ మున్సిపల్ పరిపాలన డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక శాతం నుంచి అరశాతానికి కుదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థికంగా వెనుకబడిన, రియల్ ఎస్టేట్ వ్యాపారం తక్కువగా ఉన్న పట్టణంలో ఇంటి పన్ను పేరు మార్పునకు సంబంధించిన ఫీజు ఒక శాతం విధిస్తే ప్రజలకు ఆర్థిక భారమవుతుందని మెజారిటీ కౌన్సిలర్లు భావించారు. ఏడాది క్రితం ఇంటి పన్ను పేరు మార్పునకు సంబంధించిన ఫీజు ఒక శాతంగా నిర్ణయిస్తూ కౌన్సిల్ తీర్మానించింది. దీంతో అది అమల్లోకి వచ్చింది. తర్వాత దీనిపై పట్టణ ప్రజల్లో కొంత వ్యతిరేకత వ్యక్తం కావడంతో కౌన్సిలర్లు ఒక శాతం ఫీజు వల్ల భారమవుతుందని, అరశాతానికి కుదించాలని మెజారిటీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. దీంలో భాగంగా కౌన్సిల్ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, సీనియర్ కౌన్సిలర్ గిరి రఘు ఇంటి పన్ను పేరు మార్పునకు సంబంధించిన ఫీజు అంశాన్ని లేవనెత్తి కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించారు. చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మెజారిటీ కౌన్సిలర్లు ఇంటి పన్ను పేరు మార్పు ఫీజురె ఒక శాతం నుంచి అరశాతానికి తగ్గిస్తూ తీర్మానం చేసి పంపించారు. దీని వల్ల పట్టణంలోని పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థికభారం తగ్గుతుంది. దీనిపై మంగళవారం వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, సీనియర్ కౌన్సిలర్ గిరి రఘు మాట్లాడుతూ పట్టణ ప్రజలపై భారం పడకుండా వుండాలనే ఉద్దేశంతో కౌన్సిల్ తీర్మానం చేసి పంపించామని చెప్పారు. తమ వినతిని మున్సిపల్ డైరెక్టర్ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి పనులను పరిశీలించిన డిఇ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుచ్చిమి, కాశీపేట, పణుకుపేట, అంటిపేట, లచ్చయ్యపేట గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో జరుగుతున్న సిసి రోడ్లను, శ్మశాన వాటికల పనులను క్వాలిటీ కంట్రోల్ డిఇఇ బి.లక్ష్మణరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జెఇ జి.చంద్రమౌళి, టెక్నికల్ అసిస్టెంట్ త్రినాథరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

పోలీసుల ఆధ్వర్యాన వైద్యశిబిరం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆంధ్రా - ఒడిశా వివాదాస్పద గ్రామాల్లో సాలూరు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో జెమ్స్ శ్రీకాకుళం వారి నిర్వహణలో మంగళవారం నేరెళ్లవలస వద్ద మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపుకు గిరిశిఖర గ్రామాలకు చెందిన సుమారు 350 మంది ఈ మెడికల్ క్యాంపునకు వచ్చి వైద్యుల వద్ద తనిఖీలు నిర్వహించుకొని వాటికి అవసరమైన మందులను సిబ్బంది వారికి అందజేశారు. ఈ క్యాంపునుద్దేశించి రూరల్ సిఐ పి.రామకృష్ణ మాట్లాడుతూ పోలీసుల ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా ఈ సరిహద్దు గ్రామాల పరిధిలో మెడికల్ క్యాంపులు, యువతకు వాలీబాల్ మ్యాచ్‌లు నిర్వహిస్తూ గిరిజనులు మెరుగైన జీవితాలను రూపుదిద్దుకోవాలని, వారికి ఏవైనా సమస్యలుంటే స్థానిక అధికారులకు తెలియజేసి వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని అన్నారు. యువత మంచి మార్గంలో నడవడి వారి జీవితాలు ఉన్నత స్థితిలో ఉండేలా కృషి చేసుకోవాలని ఆకాంక్షించారు. మెడికల్ క్యాంపులో జెమ్స్ ఆసుపత్రి బృందం రోగులకు తనిఖీలు చేసి అవసరమైన మందులు అందజేశారు. నేత్ర పరీక్షలు చేసి శస్త్రచికిత్స అవసరమైన వారిని జెమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్తున్నట్టు ఆసుపత్రి మేనేజర్ ఎం.సింహాచలం తెలిపారు. అనంతరం వృద్ధులకు చీరలు, దుప్పట్లను రూరల్ ఎస్సై నరసింహమూర్తి అందజేశారు. కార్యక్రమంలో జెమ్స్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, సాలూరు రూరల్ పోలీసులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - సాలూరు

పౌష్టికాహారంపై అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ పిడి టి.కనకదుర్గ చెప్పారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పౌష్టికాహార పక్షోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహారం గురించి లబ్దిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం పక్షోత్సవాల గోడ పత్రికలను విడుదల చేశారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఒ విజయలక్ష్మి, సూపర్ వైజర్ లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు .

కురుపాం : పోషణ పక్వాడపై స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుంచి కురుపాం ప్రధాన రహదారి వరకు మంగళవారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు భవాని, జానకి, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 22 వరకు ప్రతి అంగన్వాడి కేంద్రంలో అధికారులు సమన్వయంతో ప్రజలను భాగస్వామ్యం చేసి పోషణ పక్వాడపై చేయాల్సిన కార్యక్రమాలైన పౌష్టికాహారం ప్రాధాన్యత, పిల్లలు పెరుగుదలకు వెయ్యి రోజులు సంరక్షణ, బిడ్డకు తల్లిపాలు ఆవశ్యకత, వక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపైన అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు గౌరి, శ్రావణి, విజయగౌరి చక్రధర్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : పోషణ పక్షోత్సవాల గురించి సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. వెయ్యి రోజులు (గర్భధారణ మొదలుకొని 2సంవత్సరాల వయస్సు వరకు) ప్రాముఖ్యత, పోషణ, సంరక్షణ, బరువు తక్కువ పిల్లలు గుర్తింపు -సంరక్షణ చర్యలు గురించి తల్లులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారులు స్వయంగా నమోదు చేసుకొనేందుకు అవగాహన, పిల్లల్లో ఆరోగ్యకరమైన జీవన శైలి, ఆహార పద్ధతులు, అలవాటు చేసుకునేలా తల్లులకు అవగాహనా కార్యక్రమాలు అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు. తొలుత అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు.

పక్షోత్సవాల ప్రారంభంలో ఐసిడిఎస్ పీడీ

పౌష్టికాహార పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ

మినీ గోకులాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని తామరఖండిలో పల్లె పండగలో భాగంగా మినీ గోకులాన్ని మంగళవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి చెందినప్పుడే అసలైన అభివృద్ధి అని, అందుకోసం ప్రభుత్వం గోకులాల పేరుతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఆశయం నెరవేర్చేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి మొండి చేయి చూపించిందని ఎమ్మెల్యే ఆన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల వారి అభివృద్ధికి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు వేణుగోపాలనాయుడు, పెంట సత్యం, డోకల సీతమ్మ, డోకల తిరుపతిరావు, వెంకటనాయుడు, తెంటు వెంకటప్పనాయుడు, గుణుపూరు అన్నంనాయుడు, గ్రామ పెద్దలు సోమిరెడ్డి రమేష్, హేమల శ్రీరాములు, కర్రి శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే సమస్యల పరిష్కారం

అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ బివి రమణ

ప్రజాశక్తి - సాలూరు

పోరాటాలతోనే సమస్యలను పరిష్కరించుకోవచ్చునని అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ బివి రమణ చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో బివి రమణ మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, రాజకీయ వేధింపులతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే చాలీచాలని జీతంతో ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అధికారపార్టీ నాయకుల ఒత్తిడి వల్ల జిల్లాలో ఇంత వరకు 8మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారని చెప్పారు. 20ఏళ్లు గా అతి తక్కువ జీతంతో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై కక్ష సాధింపు చర్యలకు దిగడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం వీరి సమస్యలు పరిష్కరించకపోతే ఐక్య పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్వై నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు మండంగి హరనాథ్, వెంకటరమణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బివి రమణ

చిరుధాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కీసరజోడు పంచాయతీ పరిధిలోని కారిగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరరావు చిరుధాన్యాల పంటలు వేయడం వల్ల వాతావరణం, ఆరోగ్యం బాగుండి ఆదాయం పొందవచ్చని చెప్పారు. వరి సాగు ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించాలని, దీని ద్వారా రైతుకు ఖర్చు తగ్గి సమాజానికి మంచి వాతావరణం ఇచ్చిన వారమవుతామని రైతులకు చెప్పాడు. రాగి పంటను గుళిరాగి, జమున మోడల్ వేసి మంచి ఆదాయం పొడవచ్చని చెప్పారు. అలాగే అరిక మజ్జయ్య గుళిరాగి పొలంలో క్రాప్ కటింగ్ చేశారు. పిసిఒ క్రాంతి కుమార్ మాట్లాడుతూ రైతులకు కొండప్రాంతంలో చీపుర్లు పంట తగ్గించి, కొండ మామిడి, నేరడి, ఇప్ప, పనస, చింత, ఉసిరి, నల్లజీడి, కాగు, మొదలగునవి నాటడం వల్లన మంచి వాతావరణం, ఆదాయం పొందవచ్చని అన్నారు. అలాగే ఐటిడిఎ నుంచి మర్చియాష్ పైనాపిల్ ఇచ్చిన రైతులకు వేపపిండి -40 కిలో స్ప్రేర్, పావుకేజీ వేపనూనెను హెచ్ఒ గణేష్ కుమార్, జయశ్రీ, దివాకర్ అందజేశారు. ఈ శిక్షణకు 4గ్రామాలు నుంచి 42 మంది రైతులు, వెలుగు అసోసియేషన్ నుంచి గోపాల్, జగ్గయ్య, రవి, బాలరాజు, శ్రీను కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అందాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న వేతన దారులకు కనీస వేతనం అందాలని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని సంతోష పురంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు సంబంధించిన మస్తర్లను పరిశీలించిన అనంతరం తగు సూచనలు ,సలహాలు అందజేశారు. పని ప్రదేశాల్లో ముందుగా అధికారులు కొలతలు ఇవ్వాలన్నారు. కనీస వేతనం ప్రతి ఒక్కరికి అందాలన్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పనిచేసే చోట నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు.ఈ పరిశీలనలో ఫీల్డ్ అసిస్టెంట్ జి.వెంకటనాయుడు వున్నారు.

పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు వేగవంతం

పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ పైడితల్లి వెల్లడించారు. మండలంలోని గొట్టివలసలో నిర్మిస్తున్న పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని 25 పంచా యతీల్లో పశువులకు తాగునీటి నిమిత్తం నీటి తొట్టెలను నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ఇంతవరకు నిర్మాణాలు ప్రారంభించని గ్రామ పంచాయతీల్లో తక్షణమే పనులు ప్రారంభించాలని సూచించారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చక్కని ప్రణాళిక, కఠోర శ్రమతో విజయం సొంతం తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని వాసవీ, గాయత్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ పివికె మణికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో ఆ విద్యాసంస్థల ఫేర్వెల్ ఫంక్షన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతున్న సమయంలో జీవితానికి ఓ ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు చక్కని ప్రణాళిక, కఠోర శ్రమతో అందుబాటులో ఉన్న వనరును సద్వినియోగం చేసుకోవాలని. జీవిత లక్ష్యాన్ని చేరుకొని ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నతులుగా ఎదగాలని అన్నారు. నిరుపేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు వాసవీ గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ పీవీకే రమణమూర్తి స్థాపించారని, ఏ లక్ష్యంతో ఈ విద్యాసంస్థలను స్థాపించారో అదే లక్ష్యంతో విద్యా సంస్థలను నడపడం జరుగుతుందన్నారు. అలాగే విద్యార్థులు కూడా తమ లక్ష్యాలను చేరుకొని విద్యా సంస్థలకు చక్కని పేరు తీసుకొచ్చి రుణం తీర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రగతిని ప్రిన్సిపాల్స్ ఎంవిఎస్ శర్మ, కళావతి తదితరులు వివరించారు. పలువురు అధ్యాపకులు విద్యార్థులకు భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి.

ఎండ తీవ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎండ తీవ్రతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించాలన్నారు. ముఖ్యంగా ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు ఎండ తీవ్రతపై అవగాహన కల్పించి వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తగు సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. గర్భిణీలను గుర్తించి వారికి సకాలంలో వ్యాధినిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. ప్రతి నెల 9న పిహెచ్‌సిలో నిర్వహించే పిఎంఎంఎస్ఎ కార్యక్రమానికి గర్భిణీలు తీసుకొచ్చి వైద్య తనిఖీలు చేయించాలన్నారు. ప్రసవ సమయంలో గర్భిణులను 108 సాయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రసవం కోసం తరలించాలన్నారు. గ్రామాల్లో జ్వర పీడితులున్నట్లయితే ప్రథమ చికిత్స నిర్వహించి రక్తపూతలు సేకరించాలన్నారు. అందుబాటులో ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్ధనరావు, శాంతకుమారి, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

మలేరియా మందు పిచికారీ పూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఎంపికైన అన్ని గ్రామాల్లోనూ శత శాతం మలేరియా మందు పిచికారీ అయ్యేలా ప్రజలను సంసిద్ధం చేయాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. మంగళవారం బందలుప్పి, పెదబొండపల్లి పిహెచ్‌సిలను జిల్లా కన్సల్టెంట్ రామచంద్రతో కలిసి సందర్శించి ఆశాడే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కీటక జనిత వ్యాధుల పట్ల ప్రతి ఆశా కార్యకర్తకు అవగాహన ఉండాలన్నారు. మేలో ప్రారంభం కానున్న మొదటి విడత స్ప్రేయింగ్‌లో అంతా పాల్గొనేలా వైద్యాధికారులు తిరుమల ప్రసాద్,శ్రీకాంత్, ధరణి లను కోరారు.

గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎండ తీవ్రత రోజుకు అధికంగా ఉండడం వల్ల గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయాల కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు అనువుగా ఉండే చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తక్షణమే చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు బాధ్యత వహించాలన్నారు. ఎక్కడైనా బోరు బావులు మొరాయించినట్లయితే తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా తాగునీటిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.